ఎరువుల అమ్మకాల్లో నంద్యాల టాప్

- 11,500 మెట్రిక్ టన్నులకు గాను 11,964 మెట్రిక్ టన్నుల అధిక అమ్మకాలు
- ఆర్‌బీకేల ద్వారా ఎరువుల విక్రయాలు
- అత్యధికంగా పసుపుల ఆర్‌బీకేలో అమ్మకాలు


పసుపుల ఆర్‌బీకేలో ఎరువుల కోసం పేర్లు నమోదు చేసుకుంటున్న రైతులు,


ఆర్‌బీకేలో ఎరువుల స్టాక్‌ను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారులు

నంద్యాల(అర్బన్): గ్రామాల్లోనే రైతులకు ఎరువులు అందించేందుకు ఏర్పాటైన ఆర్‌బీకేల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి నంద్యాల జిల్లాకు 25 వేల మెట్రిక్ టన్నులు విడుదల కాగా 24,381 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలు జరిగాయి. జిల్లాలోని ఆరు వ్యవసాయ సబ్ డివిజన్లలో నంద్యాల వ్యవసాయ సబ్ డివిజన్‌కు 11,500 మెట్రిక్ టన్నులు కేటాయించగా 11,964.82 మెట్రిక్ టన్నుల అమ్మకాలతో మొదటి స్థానంలో నిలిచింది. డివిజన్‌లోని బండిఆత్మకూరు మండలంలో అత్యధికంగా 4,118.4 మెట్రిక్ టన్నుల ఎరువులు విక్రయం కాగా.. బనగానపల్లె మండలంలో 2584.59, నంద్యాల మండలంలో 2305.01, మహానంది మండలం 1417.405 మెట్రిక్ టన్నులు, పాణ్యం మండలం 1297.81 మెట్రిక్ టన్నులు, గడివేముల 241.605 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలు జరిగాయి.

పసుపుల ఆర్‌బీకేలో అత్యధిక విక్రయాలు..
బనగానపల్లె మండలం పసుపుల గ్రామంలోనున్న ఆర్‌బీకేలో అత్యధికంగా 835.125 మెట్రిక్ టన్నుల ఎరువులు విక్రయాలు జరిగి నంద్యాల వ్యవసాయ సబ్ డివిజన్ గ్రామాల ఆర్‌బీకేల్లో ప్రథమ స్థానంలో నిలిచింది. అలాగే బండిఆత్మకూరు మండలం ఏ.కోడూరు ఆర్‌బీకేలో 482.6 మెట్రిక్ టన్నులు, బనగానపల్లె మండలం కైప గ్రామంలో 433.27, బండిఆత్మకూరు మండలం బండిఆత్మకూరు–2 ఆర్‌బీకేలో 425.06 మెట్రిక్ టన్నుల ఎరువుల విక్రయాలు జరిగాయి. 2023–24 సంవత్సరానికి ఎరువుల అమ్మకాలను మూడింతలు సాధించేందుకు లక్ష్యం నిర్దేశించామని ఏడీఏ రాజశేఖర్ తెలిపారు. దీనికి అనుగుణంగా ఎరువులు కూడా రైతు భరోసా కేంద్రాల్లో రైతులకు అందుబాటులో ఉండేలా ప్రణాళికలు రూపొందించామంటున్నారు.

రైతుల నుంచి సేకరించి ల్యాబ్‌లో చేపట్టిన పరీక్షలు..

యాక్ట్ సాంపుల్స్	నిర్దేశం	ప్రగతి
విత్తన నమూనాలు	137	137
ఎరువుల నమూనాలు	89	82(7అండర్ ప్రాసెస్)

వైఎస్సార్ అగ్రి టెస్టింగ్ ల్యాబ్ ప్రగతి..
నంద్యాల వ్యవసాయ సబ్ డివిజన్‌కు సంబంధించి పట్టణంలోని నూనెపల్లెలో ఏర్పాటైన డాక్టర్ వైఎస్సార్ అగ్రిటెస్టింగ్ ల్యాబ్ ద్వారా 2022–23 ఆర్థిక సంవత్సరానికి గాను రైతుభరోసా కేంద్రాలు, రైతుల ద్వారా వివిధ రకాల విత్తనాలు సేకరించి పరీక్షల అనంతరం రైతులకు అందించాలి. రైతులు, డీలర్లు విత్తన, ఎరువుల నాణ్యతను పరీక్షించుకునేందుకు నమూనాలు ఇస్తే వాటి పరీక్షలు ఉచితంగానే చేస్తామని ఏడీఏ తెలిపారు.

జిల్లాలో డివిజన్‌ల వారీగా ఎరువుల అమ్మకాలు..

డివిజన్ (హబ్)	మంజూరు (మెట్రిక్ టన్నులు)	అమ్మకాలు
నంద్యాల	11,500	11,964.82
ఆళ్లగడ్డ	3,800	3,760
ఆత్మకూరు	3,500	3,602
కోవెలకుంట్ల	2,800	2,216
డోన్	900	808.3

క్లుప్తంగా

ఇళ్ల పట్టాలు ఇప్పించండి


శిల్పామోహన్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

నంద్యాల(అర్బన్): ముప్పై ఏళ్ల క్రితం ప్రభుత్వ పోరంబోకు స్థలాల్లో నివాసముంటున్న పాన్నాపురం కాలనీ వాసులకు ఇళ్ల పట్టాలు ఇప్పించాలని సీపీఎం పట్టణ కార్యదర్శి పుల్లా నరసింహులు కోరారు. ఈ మేరకు శనివారం మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు శిల్పామోహన్‌రెడ్డికి వినతి పత్రం అందజేశారు. పుల్లా నరసింహులు మాట్లాడుతూ 30ఏళ్లుగా నివాస గృహాలకు రోడ్లు, మౌలిక వసతులు లేక స్థానికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పలుమార్లు సంబంధిత అధికారులకు వివరించినా ప్రయోజనం లేకుండా పోయిందన్నారు. ఇప్పటికైనా మౌలిక సదుపాయాలు కల్పించాలని విజ్ఞప్తి చేశారు. నాయకులు లక్ష్మణ్, సద్గురు, కాలనీవాసులు సుబ్బమ్మ, సుంకులమ్మ, మల్లికార్జున, రామాంజనేయులు పాల్గొన్నారు.

పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్


శిరివెళ్ల జెడ్పీ స్కూల్ వద్ద బందోబస్తును పరిశీలిస్తున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి

శిరివెళ్ల: పదో తరగతి పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ విధించినట్లు డీఎస్పీ సుధాకర్ రెడ్డి తెలిపారు. శనివారం మండలంలోని శిరివెళ్ల జెడ్పీ ఉన్నత పాఠశాల, మోడల్ స్కూల్, యర్రగుంట్ల జెడ్పీ ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రలను తనిఖీ చేశారు. బందోబస్తుపై ఆయా కేంద్రాల చీఫ్‌లను అడిగి తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ పరీక్ష కేంద్రాల వద్ద ప్రభుత్వం పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేసిందన్నారు. బందోబస్తులో గ్రామ సచివాలయ మహిళా పోలీస్‌ల సేవలను వినియోగించుకుంటున్నామని చెప్పారు. సమస్యాత్మక కేంద్రాలపై మరింత నిఘా పెట్టాలని సీఐలు, ఎస్‌ఐలను ఆదేశించామన్నారు. సీఐ చంద్రబాబునాయుడు, ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు


ప్రారంభిస్తున్న ఎస్‌ఐ మల్లికార్జున

గోస్పాడు: వేసవిలో దాహార్తి తీర్చేందుకే చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు. మండల కేంద్రానికి చెందిన ప్రసాదు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఎస్‌ఐ శనివారం ప్రారంభించారు. యువకుడిని ఎస్‌ఐ అభినందించారు. పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఆలయాభివృద్ధికి విరాళం


దాతలకు రశీదు అందజేస్తున్న దృశ్యం

రుద్రవరం: మండలంలోని వెలగలపల్లె పొలమేరలో వెలసిన లక్ష్మీగోదా సమేత వాసాపురం వేంకటేశ్వరస్వామి వారికి శనివారం మండల కేంద్రానికి చెందిన కాశంగి చంద్రశేఖర్, అమృతవల్లి దంపతులు, కుటుంబ సభ్యులు రూ.1,11,111 విరాళంగా అందజేశారు. దాతలను ఆలయ నిర్వాహకులు, అర్చకులు సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఇదిలా ఉండగా..శనివారం ఉదయాన్నే అర్చకులు స్వామి అమ్మవార్లకు నిత్య పూజలు చేశారు. అభిషేకాల అనంతరం పట్టు వస్త్రాలు,పూలమాలలతో ప్రత్యేకంగా అలంకరించి భక్తులను దర్శనానికి అనుమతించారు. స్థానికులతో పాటు వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు స్వామి అమ్మవార్లకు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, ట్రెజరర్ నరసింహులు ఉన్నారు.

కనుల పండువగా వేంకటేశ్వరుడి గ్రామోత్సవం


గాజులపల్లెలో వేంకటేశ్వరుడికి గ్రామోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

మహానంది: గాజులపల్లెలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవేంకటేశ్వరస్వామి గ్రామోత్సవం శనివారం వైభవంగా జరిగింది. ఆలయార్చకులు స్వామిఅమ్మవార్ల ఉత్సవమూర్తులను వివిధ రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. మేళతాళాలు , మంగళవాయిద్యాల మధ్య స్వామివార్ల గ్రామోత్సవం కనుల పండువగా జరిగింది. కార్యక్రమంలో ఆలయ కమిటీ ,శ్రీసేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

17న అన్నదాన సత్రం ప్రారంభం

నంద్యాల(వ్యవసాయం): ఈనెల 17వ తేదీన శ్రీశైలంలో ఆరెకటికల అన్నదాన సత్రం ప్రారంభిస్తామని అఖిల భారత ఆరెకటిక యువజన ప్రధాన కార్యదర్శి నాగేంద్రరావు తెలిపారు. శనివారం స్థానిక అయ్యప్ప ఆలయ ఆవరణలో సంఘం పట్టణ నాయకుల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సత్రం ప్రారంభోత్సవానికి కేంద్ర మంత్రి డాక్టర్ వీరేంద్రకుమార్ రానున్నారని చెప్పారు. కార్యక్రమానికి కులస్తులు హాజరవ్వాలని కోరారు. బాబురావు, రాజశేఖర్‌రావు, కిశోర్‌కుమార్, హీరాలాల్, వీరేంద్ర పాల్గొన్నారు.

తీర్మానాన్ని వ్యతిరేకించడం సరికాదు

నంద్యాల(అర్బన్): వాల్మీకుల ఎస్టీ పునరుద్ధరణ అంశంపై ప్రభుత్వం చేసిన తీర్మానాన్ని వ్యతిరేకించడం సరైంది కాదని వీఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పులికొండన్న పేర్కొన్నారు. జోనల్ పద్ధతిలో రాయలసీమ ప్రాంత వాల్మీకులను ఎస్టీలుగా పునరుద్ధరించేందుకు చేసిన తీర్మానంపై స్థానిక బాల్కొండ హాల్ వాల్మీకులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగించి 8 జిల్లాల వాల్మీకులను న్యాయం జరిగేలా చూడాలని కోరారు. సాయి, వంశీ, నాయుడు, మధు, చక్రీ, శివ, రాముడు, జయన్న, వాసు పాల్గొన్నారు.

యోగాతో ఆరోగ్యం


రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో యోగా చేస్తున్న దృశ్యం

నంద్యాల: ఆరోగ్యంగా ఉండటానికి యోగాను జీవిత అలవాట్లలో చేర్చుకోవాలని నంది గ్రూప్ సంస్థల ఎండీ సుజల పేర్కొన్నారు. పట్టణంలోని క్రాంతినగర్‌లో శ్రీ రామచంద్ర మిషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న యోగా తరగతులను శనివారం ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ శరీరాన్ని, మనసును సమతుల్యంలోకి తెచ్చేదే యోగా అని చెప్పారు. శారీరక వ్యాయామాన్ని మించిన ప్రయోజనాలు యోగా వల్ల లభిస్తుండటంతో పాశ్చాత్య ప్రపంచం కూడా యోగా పట్ల ఆకర్షితులు అవుతున్నారన్నారు. యోగాసానాల వల్ల రక్తప్రసరణ మెరుగు అవుతుందని, శరీరం నుండి విషతుల్యాలు వేగంగా బయటకు వెళ్లిపోతాయని, ఒత్తిళ్లలో కూరుకుపోతున్న నేటి తరానికి యోగా అత్యంత అవసరమన్నారు.

మరణాన్ని జయించిన ఏసు


పీస్ ర్యాలీని ప్రారంభిస్తున్న బిషప్ పుష్పలలిత

నంద్యాల(అర్బన్): ఏసుక్రీస్తు మరణాన్ని జయించి తిరిగి లేచెనని నంద్యాల డయాసిస్ బిషప్ పుష్పలలిత అన్నారు. స్థానిక హోలీక్రాస్ కెథడ్రల్ చర్చి వద్ద రన్ ఫర్ జీసెస్ పీస్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. చంద్రపాల్ పర్యవేక్షణలో నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి పుష్పలలిత మాట్లాడుతూ క్రీస్తు శిలువ శ్రమలను పొంది మరణించిన అనంతరం పునరుత్థానుడయ్యాడన్నారు. ఈ విజయానికి గుర్తుగా ప్రతి క్రైస్తవ విశ్వాసి విజయ యాత్రలో (పీస్ ర్యాలీ) పాల్గొన్నాలని పిలుపునిచ్చారు. హోలీక్రాస్ కెథడ్రల్ పాస్ట్రేట్–2 చైర్మన్ రెవరెండ్ సామ్యేల్ రత్నరాజు మాట్లాడుతూ క్రీస్తు సిలువపై మానవాళి రక్షణకు ప్రాణ త్యాగం చేయడం చరిత్రాత్మక సంఘటన అన్నారు. ర్యాలీ వైఎస్సార్ జంక్షన్, సంజీవనగర్, శ్రీనివాసనగర్, సాయిబాబానగర్, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, దేవనగర్, వీసీ కాలనీ మీదుగా తిరిగి చర్చికి చేరుకున్నారు. రెవరెండ్ జోసెఫ్, వినయ్‌కుమార్, కెన్నీబాబు, మేరడోన, పాల్ రాజరావు, ఇమ్మానియేల్, ఏసుదాసు, మన్యంజాన్ పాల్గొన్నారు.

నేడు ఈస్టర్.. : క్రీస్తు గుడ్ ఫ్రైడే రోజున శిలువపై మరణించి మూడవ రోజైన ఆదివారం తెల్లవారుజామున పునరుత్థానుడవడాన్ని క్రైస్తవులు ఈస్టర్ పండుగగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా చర్చిలను అందంగా ముస్తాబు చేశారు.

సత్తా చాటిన అనంతపురం జిల్లా వృషభాలు

బేతంచెర్ల: మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం గ్రామంలో శ్రీరామ నవమి వేడుకలను పురస్కరించుకొని న్యూ కేటగిరి బండలాగుడు పోటీలను నిర్వహించారు. హోరా హోరీగా సాగిన పోటీల్లో అనంతపురం జిల్లా, ఉబ్బు చెర్ల గ్రామం గోవిందు వృషభాలు మొదటి స్థానంలో నిలువగా నంద్యాల మండలం, కానాల గ్రామం గుండం చెన్నారెడ్డి వృషభాలు రెండవ స్థానంలో నిలిచాయి. అదేవిధంగా ఓర్వకల్లు మండలం , హుస్సేనాపురం రామ సుబ్బారెడ్డి వృషభాలు మూడవ, నంద్యాల మండలం టీ. హుస్సేనాపురం రామ సుబ్బారెడ్డి వృషభాలు నాల్గవ స్థానంలో నిలిచాయి. విజేత వృషభాల యాజమాన్యాలకు వరుసగా రూ. 50 వేలు, రూ. 35 వేలు, రూ.20 వేలు, రూ. 10 వేల చొప్పున అందజేశారు.

మొక్కజొన్న పంట దగ్ధం


దగ్ధమైన మొక్కజొన్న పంట, పైపులు చూపుతున్న రైతులు

మిడుతూరు: మండల పరిధిలోని రోళ్లపాడు గ్రామ పరిధిలోని 519 సర్వే నంబర్‌లోని 6 ఎకరాల విస్తీర్ణంలోని మొక్కజొన్న పంట శుక్రవారం దగ్ధమైంది. అలాగే పొంలోని లింకు, కేసింగ్ పైపులు, బోరు బావుల వద్ద ఉన్న స్టార్టర్లు కాలిపోయాయి. గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు 519 సర్వేనంబర్‌లో సునీత 1.50 ఎకరాలు, నాగలక్ష్మమ్మ 2 , సంజీవ 1.50, సంజీవ ఎకరంలో మొక్కజొన్న సాగు చేపట్టారు. శుక్రవారం గుడ్‌ఫ్రైడే వేడుకలలో భాగంగా రైతులు ప్రార్థనామందిరాలలో ఉండగా మధ్యాహ్న సమయంలో నిప్పంటుకొని కాలిబూడిదయ్యింది. దీంతో రైతులకు లక్షల రూపాయలలో నష్టం వాటిల్లిందని రైతులు వాపోయారు. విషయం తెలుసుకున్న గ్రామ వీఆర్వో ప్రసాదు, వీఆర్‌ఏ రమణ ఘటనా స్థలానికి చేరుకొని దగ్ధమైన పంట పొలాలను పరిశీలించారు. నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం అందజేసి బాధిత రైతులను ఆదుకోవాలని గ్రామ సర్పంచ్ నాగారెడ్డి స్వామిరెడ్డి కోరారు.

రామాయణం ఆదర్శం

పాణ్యం: రామాయణం మానవజాతికి ఆదర్శం అని టీటీడీ ధర్మ ప్రచారక్ ఉమ్మడి జిల్లా కార్యనిర్వాహకులు మల్లు వెంకట్‌రెడ్డి అన్నారు. గోనవరం గ్రామంలో ఐదు రోజులుగా జరుగుతున్న ధార్మిక సంస్కృతి కార్యక్రమాల ముగింపులో భాగంగా శనివారం ఆలయ ప్రాంగణంలో సామూహిక కుంకుమర్చన, గోపూజ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ పిల్లలకు నైతిక విలువల గురించి తెలియజేయాలన్నారు.

మద్దిలేటి నరసింహస్వామికి ప్రత్యేక పూజలు

బేతంచెర్ల: వైష్ణవ పుణ్య క్షేత్రమైన శ్రీ మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలో చైత్రమాసం శనివారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉమ్మది కర్నూలు జిల్లాతోపాటు తెలంగాణా, కర్ణాటక రాష్ట్రాల నుంచి స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి, అమ్మవార్లకు అభిషేకం, ఆకుపూజ, కుంకుమార్చన, మహామంగళ హారతి ఇచ్చారు. సేవా టికెట్స్, లడ్డు ప్రసాదం, గదుల బుకింగ్, అన్నదానం చందాలు, గండాదీపం, విరాళాలు, కల్యాణ కట్ట తదితర సేవల ద్వారా రూ. రూ.8,45,711లక్షల ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ పాండు రంగారెడ్డి, ఆలయ చైర్మన్ సీతారామచంద్రుడు తెలిపారు.

చౌడేశ్వరిదేవి సేవలో ఎస్పీ


అమ్మవారి ప్రసాదాన్ని స్వీకరిస్తున్న జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి

బనగానపల్లెరూరల్: మండలంలో నందవరం గ్రామంలో వెలసిన శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారిని నంద్యాల జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డి శనివారం సాయంత్రం దర్శించుకున్నారు. ఎస్పీకి ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం శ్రీ చౌడేశ్వరిదేవి అమ్మవారికి కుంకుమార్చన అభిషేకం తదితర పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ సంప్రదాయం మేరకు అర్చకులు ఎస్పీని పూలమాల దుశ్శాలువేసి ఘనంగా సన్మానించి అమ్మవారి ప్రసాదం అందజేశారు.

'బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుదాం'

నంద్యాల(అర్బన్): కాంగ్రెస్ పార్టీ నాయకుడు రాహుల్‌గాంధీపై అనర్హత వేటు వేసిన బీజేపీ ప్రభుత్వానికి బుద్ధి చెబుదామని ఏపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతల మోహన్‌రావు తెలిపారు. రాహుల్‌గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర అనంతరం చేయి చేయి కలుపుదాం కాంగ్రెస్ పార్టీని బలపరుద్దాం అనే కార్యక్రమంలో భాగంగా స్థానిక క్రాంతినగర్‌లో యాత్రకు సంబంధించిన ఉత్తరాలను శనివారం ప్రజలకు అందజేశారు. ఆయన మాట్లాడుతూ నిత్యావసర సరుకులు, పెట్రోల్, డీజిల్ ధరలను పెంచుతూ పోతున్న బీజేపీకి వచ్చే ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు చింతలయ్య, ఊకొట్టు వాసు, హెచ్‌వైడీ ప్రసాద్, చాబోలు సలాం పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులను పరిష్కరించండి

నంద్యాల(సిటీ): స్పందన గ్రీవెన్స్ సెల్‌కు వచ్చిన సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు సూచించారు. శనివారం స్థానిక కార్యాలయంలో స్పందన కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి రోజూ స్పందనలో వచ్చే ఫిర్యాదులను ప్రాధాన్యంగా తీసుకుని సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్పందన ఫిర్యాదులను ప్రతి ఆదివారం పూర్తి చేయాలని చెప్పారు. మున్సిపల్ రెవెన్యూ అధికారి వరప్రసాద్, కమాండ్ కంట్రోల్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా స్వాతి వేడుకలు



నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని తెలుగుపేటలో వెలసిన శ్రీమద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో శనివారం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే స్వామి వారి పంచామృతాభిషేకం, స్నపన తిరుమంజన సేవ నిర్వహించి స్వామి వారికి పట్టువస్త్రాలతో అలంకరించి భక్తులకు దర్శనమిచ్చారు. లక్ష్మీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆకుపూజ, సామూహిక కుంకుమార్చన చేపట్టి మహామంగళ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను పల్లకీలో ఆశీనులు గావించి ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణ చేయించారు. అర్చకులు రామానుజన్, దేవాలయ నిర్వాహకులు మధుసూదన రాయలు పాల్గొన్నారు.

ఆలయాల్లో ప్రత్యేక పూజలు


సుద్దమల్ల శ్రీ లక్ష్మీనరసింహ కంబగిరి స్వామి ఆలయంలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఉయ్యాలవాడ : మండలంలోని ఆర్.జంబులదిన్నె, ఉయ్యాలవాడ, సుద్దమల్ల, ఇంజేడు గ్రామాల్లో వెలిసిన శ్రీ అభయాంజనేయస్వామి, లక్ష్మీనరసింహ కంబగిరిస్వామి, శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనివారం ఆయా గ్రామాల్లో భక్తులు ఉదయాన్నే ఆలయాలకు చేరుకుని కుంకుమార్చన, ఆకుపూజ, అభిషేకాలు చేపట్టారు. పూజల అనంతరం అర్చకులు లక్ష్మణ స్వామి, భాస్కరశర్మ, కమలేష్‌శర్మ, అనంతయ్య భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆంజనేయస్వామికి క్షీరాభిషేకం


ఆంజనేయస్వామికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని సంజీవనగర్ రామాలయంలో నిర్వహిస్తున్న సుందరకాండ మహాయజ్ఞంలో భాగంగా శనివారం ఆంజనేయ స్వామికి 108 లీటర్లతో క్షీరాభిషేకం చేశారు. అనంతరం సుందరకాండ మహాయజ్ఞాన్ని వేదంపడితులు యాదవల్లి కార్తికేయ శర్మ ఐదో రోజు శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం మహామంగళ హారతులు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సాయంత్రం ప్రదోషకాల పూజలు నిర్వహించి విశేష సింధూరార్చన చేపట్టి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. సూర య్య, దేవరశెట్టి శ్రీనివాసులు, మధు పాల్గొన్నారు.

ప్రగతిని వివరించి.. అభిప్రాయాలు సేకరించి


తోడేండ్లపల్లిలో లబ్ధిదారులతో మాట్లాడుతున్న ఎంపీపీ వీరభద్రుడు


40వ వార్డులో లబ్ధిదారు నుంచి వివరాలు సేకరిస్తున్న మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్


24వ వార్డులో లబ్ధిదారుల నుంచి ఫీడ్‌బ్యాక్ తీసుకుంటున్న దృశ్యం

నంద్యాల: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ప్రగతిని వివరించడంతో పాటు గతంలో చంద్రబాబు ప్రభుత్వ పనితీరుకు, జగనన్న పాలన మధ్యనున్న వ్యత్యాసం ప్రజలకు వివరించడమే కాకుండా ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించేందుకు వైఎస్సార్‌సీపీ శ్రేణులు శనివారం పట్టణంలో ఇంటింటికీ తిరిగారు. జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని 42 వార్డుల్లో, నంద్యాల, గోస్పాడు మండలాల్లో గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇంటింటికీ వెళ్లి అభివృద్ధి, పథకాలను వివరించి వారి అనుమతితో ఇళ్లకు మా నమ్మకం నువ్వే జగన్ స్టిక్కర్లను అతికించారు. పట్టణంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీధర్, వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా కన్వీనర్ సాయిరాంరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

- ఆళ్లగడ్డ: పాలనలో విప్లవాత్మక మార్పులు తీసుకొస్తూ దేశంలోనే ఆదర్శ రాష్ట్రంగా నిలుపుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోమారు ఆశీర్వదించాలని చాగలమర్రి ఎంపీపీ వీరభద్రుడు కోరారు. జగననన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా శనివారం చాగలమర్రి మండలం తోడేండ్లపల్లిలో గృహసారథులు, వార్డు సచివాలయాల కన్వీనర్లతో కలిసి ఇంటింటికీ వెళ్లి ప్రజలకు పథకాలు, అభివృద్ధి గురించి, గత ప్రభుత్వాల పాలన,నేటి జగనన్న పాలనలోని తేడాలను వివరించారు. సర్పంచ్ గోవిందయ్య, నాయకులు పెద్ద అంకాల్‌రెడ్డి, శ్రీనివాసులు, గిరి, రాజు, రంగయ్య, లక్ష్మీనరసయ్య, అర్జున్, లక్ష్మయ్య, ఆంజనేయులు, రఘురాం, భాస్కర్‌రెడ్డి ఉన్నారు. అలాగే..చాగలమర్రిలోని 19వ వార్డులో ముస్లిం మైనార్టీ నాయకుడు బాబూలాల్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. కుమార్‌రెడ్డి, ఇబ్రహీం, జాబీర్, ఎంపీటీసీ ఫయాజ్ ఉన్నారు.
- శిరివెళ్ల: మండలంలో నువ్వే మా నమ్మకం జగన్ కార్యక్రమం శనివారం ముమ్మరంగా సాగింది. స్థానిక 3వ గ్రామ సచివాలయ కన్వీనర్, ఉప సర్పంచు ఇంతియాజ్ ఆధ్వర్యంలో గృహ సారథులు, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి ప్రజల అభిప్రాయాలను సేకరించారు. చెన్నూరులో సచివాలయ కన్వీనర్ రామకృష్ణారెడ్డి ఆధ్వర్యంలో, జీనేపల్లె సచివాలయ కన్వీనర్ మాజీ ఉప సర్పంచు రంగయ్య ఆధ్వర్యంలో చేపట్టారు. రిటైర్డ్ ఎంఈఓ మహబూబ్‌బాషా, సర్పంచు దగడ మహేశ్వరి, నాగభూషణంరెడ్డి పాల్గొన్నారు.
- దొర్నిపాడు: మండలంలోని అన్ని గ్రామాల సచివాలయ పరిధిలో శనివారం మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ భూమా చెంచిరెడ్డి. మండల కన్వీనర్ శివారెడ్డి, సచివాలయ కన్వీనర్లు రఫీ, సురేఖ, వాసు, లక్ష్మీపార్వతి, హుసేన్‌బాషా, మైనుద్దీన్, శ్రీపతి ప్రసాద్, జాకీర్‌బాషా పాల్గొన్నారు.

- ఉయ్యాలవాడ : వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చి ప్రతి ఒక్కరికీ మంచి చేయడంతోనే ఇంటింటికీ వెళ్తున్నామని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని కాకరవాడ గ్రామంలో మా నమ్మకం నువ్వే జగన్ కార్యక్రమంలో భాగంగా ఉప సర్పంచ్ పార్థసారధిరెడ్డి, మాజీ సర్పంచ్ చెన్నూరు భాస్కర్‌రెడ్డి, బైరెడ్డి రాజశేఖర్‌రెడ్డితో కలిసి ఇంటింటికీ వెళ్లి సంక్షేమం, అభివృద్ధి పనులను ప్రజలకు వివరించారు.


కాకరవాడలో కార్యక్రమంలో పాల్గొన్న కర్రా హర్షవర్ధన్‌రెడ్డి

బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు అతికిస్తే చర్యలు

నంద్యాల(సిటీ): పోస్టర్ ఫ్రీ పట్టణంగా నంద్యాలను తీర్చిదిద్దేందకు చర్యలకు ఉపక్రమించినట్లు మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని ప్రధాన కూడళ్లలో మున్సిపల్ అధికారుల అనుమతి లేకుండా కరపత్రాలు, పోస్టర్లు, ప్లాస్టిక్ ఫ్లెక్సీలు అతికిస్తే చర్యలు తప్పవని గతేడాది ఫిబ్రవరి 22న తెలియజేశామని గుర్తు చేశారు. నిబంధనలు అతిక్రమించిన యువిస్ అకాడమీ సంస్థకు రూ.10వేలు జరిమానాతో పాటు చట్టపరమైన చర్యలకు పట్టణ 2టౌన్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. ఇప్పటికే అనుమతి లేకుండా పోస్టర్లు అతికించరాదని హెచ్చరికలు జారీ చేశామన్నారు. ఆదేశాలను అతిక్రమిస్తే 1997 యాక్ట్ ప్రకారం చర్యలు తప్పవన్నారు.

శిరివెళ్లలో చోరీ

- ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు అపహరణ
- పాఠశాలకు వెళ్లి వచ్చేలోపు ఉపాధ్యాయిని ఇంట్లో ఘటన


మంచం అరను ధ్వంసం చేసిన దృశ్యం

శిరివెళ్ల: స్థానిక కెనరా బ్యాంక్ వెనుక హుసేన్ నగర్‌లో నివాసముంటున్న ఉపాధ్యాయిని షేక్ గౌస్‌బీ ఇంట్లో శనివారం చోరీ జరిగింది. ఆమె శిరివెళ్లలో నివాసముంటూ యర్రగుంట్ల ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలలో విధులు నిర్వర్తిస్తుంది. విధుల్లో భాగంగా ఉదయమే పాఠశాలకు వెళ్లి తిరిగి మధ్యాహ్నం ఇంటికి రాగా తలుపులు తెరిచి ఉండటంతో ఆందోళనతో లోపలి వెళ్లి చూడగా బీరువా తెరిచి ఉండటం, మంచానికి ఉన్న లాకర్‌ను బద్దలుగొట్టి అందులోనున్న 8 తులాల బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్లారని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఎస్‌ఐ శరత్‌కుమార్‌రెడ్డి ఇంటి వద్దకు చేరుకొని విచారణ చేపట్టారు. కర్నూలు నుంచి క్లూస్ టీంను రప్పించారు. వారు ఇంటి తలుపు తాళం, బీరువా, మంచం లాకర్‌పైన్న వేలి ముద్రలను సేకరించారు. కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.